క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ



కాటారం: మండల ఎంపీడీఓగా పిల్లి వీరస్వామి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వర్తించిన ఉపేంద్రయ్య బదిలీల్లో భాగంగా ఖమ్మంకు వెళ్లగా జిల్లాలోని మొగుళ్లపల్లి ఎంపీడీఓగా పని చేస్తున్న వీరస్వామి కాటారానికి వచ్చారు. ఎంపీడీఓగా బాధ్యతలు చేపట్టిన ఆయనను పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

పాఠశాలలో వైద్యశిబిరం



కాటారం: మండలంలోని మేడిపల్లి గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో గురువారం వైద్యాధికారిణి డాక్టర్ మౌనిక ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థులను పరీక్షించి అవసరమైన వారికి మందులు అందజేశారు. విద్యార్థులు పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఆరోగ్య సంబంధిత పలు అంశాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం జి.రవిశంకర్, వైద్యులు ప్రియాంక, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

ఎస్ఎస్ తాడ్వాయి: మండలంలోని కాటాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు లంజపెల్లి నర్సయ్య తల్లి వెంకలక్ష్మి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబాన్ని ఆ పార్టీ మండల అధ్యక్షుడు బొల్లు దేవేందర్ నాయకులతో కలిసి పరామర్శించి రూ.8వేలు ఆర్థిక సాయం అందజేశారు. అలాగే అదే గ్రామంలో ఇటీవల మృతి చెందిన రాదారపు సంజీవ్ కుటుంబాన్ని పరామర్శించి రూ.20వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు ఎండీ ముజఫర్‌హుస్సేన్, మాజీ సర్పంచ్ ఇర్స సునీల్‌దొర, నాయకులు బండారి చంద్రయ్య, పల్నాటి సత్యం, పులి రవి, అనందం, మద్దూరి రాజు, పుల్లూరి నాగార్జున్, శ్రీను పాల్గొన్నారు.

కన్నాయిగూడెం: మండలంలోని సర్వాయి గ్రామ పంచాయతీ పరిధిలోని మల్కపల్లికి చెందిన పొడెం లక్ష్మయ్య ఇటీవల మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబానికి ముప్పనపల్లి సహాయ నిధి టీమ్ ఆధ్వర్యంలో గురువారం రూ.ఐదు వేల ఆర్థిక సాయం అందజేశారు. అబ్బు సతీష్, తిప్పనపల్లి విజయ్, రాజు, నామని రాజేష్, మురళి ఉన్నారు.

వసతులు కల్పించాలి



ఏటూరునాగారం: ఆదివాసీలకు కనీస వసతులు కల్పించాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి గొంది రాజేష్ ప్రభుత్వాలను కోరారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన ఆ సంఘం నాయకుల సమావేశంలో రాజేష్ మాట్లాడారు. ఈ నెల 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని గ్రామ గ్రామాన జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ఏజెన్సీ ప్రాంతంలోని ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వాలు వెంటనే పరిష్కరించాలన్నారు. సీజనల్ వ్యాధులు నివారించేందుకు, ములుగు ఏజెన్సీ జిల్లాలో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలని డిమాండ్ చేశారు.

'చట్టాలను పటిష్టంగా అమలు చేయాలి'

వెంకటాపురం(కె): ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసీ చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని ఆదివాసీ సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఆదివాసీ సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో తహసీల్దార్ లక్ష్మీరాజయ్యకు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఏజెన్సీ లో 1/70 చట్టాన్ని, పెసా చట్టాలను అమలు చేయాలని అన్నారు. ఆదివాసీల సాగులో ఉన్న పోడు భూములకు పట్టాలను ఇవ్వాలన్నారు.

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకం

ఎస్ఎస్‌తాడ్వాయి: నేరాల నియంత్రణ, కేసుల ఛేదనలో సీసీ కెమెరాల కీలక పాత్ర కీలక పాత్ర పోషిస్తాయని తాడ్వాయి ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటులో భాగంగా గురువారం మండలంలోని నార్లాపూర్, కాటాపూర్ గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు కోసం టెక్నిషియన్‌కు కాటాపూర్ గ్రామానికి చెందిన కమిటీ సభ్యులు రూ. 89వేలు, నార్లాపూర్ గ్రామానికి చెందిన కమిటీ సభ్యులు రూ. 60వేలు అడ్వాన్స్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. మండలంలోని 18 గ్రామపంచాయతీల్లో సీసీ కెమెరాలు చేసుకోవాలని అగాహన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. మొట్టమొదటిగా నార్లాపూర్, కాటాపూర్ గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు.

తల్లిపాలతో పిల్లలకు సంపూర్ణ ఆరోగ్యం



భూపాలపల్లి రూరల్: గొర్లవీడు గ్రామంలో ర్యాలీలో పాల్గొన్న అంగన్‌వాడీ టీచర్లు, మహిళలు

భూపాలపల్లి రూరల్: తల్లిపాలతో పిల్లలకు ఆరోగ్యమని అంగన్‌వాడీ క్లస్టర్ సూపర్ వైజర్ సునిత అన్నారు. తల్లి పాల వారోత్సవాల సందర్భంగా భూపాలపల్లి మండలంలోని గొర్లవీడు గ్రామంలో అంగన్‌వాడీ–1 కేంద్రం ఆధ్వర్యంలో గురువారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సునీత మాట్లాడారు. బిడ్డకు జన్మనిచ్చిన వెంటనే గంటలోపు తల్లిపాలు పట్టించాలని సూచించారు. అలాగే ఆరు నెలల వరకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని తెలిపారు. ఆరు నెలల తర్వాత అనుబంధ ఆహారంతోపాటు తల్లిపాలు కొనసాగించాలని వివరించారు. తల్లిపాల ప్రాముఖ్యతపై వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ సరోజన, ఆశా వర్కర్లు గాజుల సుజాత, కొప్పుల లలిత, అంగన్‌వాడి ఆయా గాజెలక్ష్మి, గర్భిణులు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

మొగుళ్లపల్లి: మండలంలోని పర్లపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ సెంటర్లలో గురువారం తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీడీపీఓ అవంతి హాజరై, మాట్లాడారు. బిడ్డ పుట్టిన వెంటనే గంటలోపు ముర్రుపాలు పట్టించడం బిడ్డకి మొదటి టీకా వంటిదని తెలిపారు. మొదటి ఆరు నెలలు నిండే వరకు తల్లిపాలు, ఏడు నెలల నుంచి రెండు సంవత్సరాల లోపు తల్లిపాలను కొనసాగిస్తూ అదనపు ఆహారాన్ని ఇవ్వాలని సూచించారు. ఆరోగ్యంగా ఉండాలంటే ఆకుకూరలు, కూరగాయలు పండ్లు ప్రతిరోజు తీసుకోవాలని వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని తెలిపారు. పరిశుభ్రతను పాటించడం ద్వారా వ్యాధులకు దూరంగా ఉండొచ్చని తెలిపారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రంలో ఇచ్చే ఆరోగ్య లక్ష్మి భోజనం, పాలు కోడిగుడ్లు ప్రతిరోజు గర్భిణీ, బాలింతలు అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చి తినాలని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రజిత, అంగన్‌వాడీ టీచర్లు పద్మ, సరోజన, ప్రమీల, స్వరూప, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

చిట్యాల: పుట్టిన ప్రతి బిడ్డకు తల్లీపాలే శ్రేయస్కరమని సీడీపీఓ అవంతి అన్నారు. గురువారం మండలంలోని నైన్‌పాకలోని అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవంలో అవంతి మాట్లాడారు. ప్రతి సంవత్సరం ఆగస్టు 1నుంచి 7వరకు తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డెలివరీ అయిన వెంటనే ముర్రుపాలను పిల్లలకు పట్టించాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జయప్రద, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరం: పుట్టిన బిడ్డకు వెంటనే తల్లి ముర్రుపాలు తాగించాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నాగరాణి అన్నారు. గురువారం మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని ఎస్సీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. తల్లులు, గర్భిణులకు తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. వారి వెంట అంగన్‌వాడీ టీచర్ రమ ఉన్నారు.



మొగుళ్లపల్లి: పర్లపల్లిలో తల్లిపాల వారోత్సవాల నిర్వహణ..



చిట్యాల: సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీఓ అవంతి



కాళేశ్వరం: మాట్లాడుతున్న సూపర్‌వైజర్ నాగరాణి

ప్రమాదకరంగా గుంతలు



ఎర్రగుంట చెరువు సమీపంలో రోడ్డుపై గుంత

మల్హర్: మండల కేంద్రం తాడిచర్ల నుంచి కొయ్యూరు నాగులమ్మ వరకు ఏర్పాటు చేసిన డబుల్ రోడ్డుపై పలు చోట్లు భారీ గుంతలు ఏర్పాడ్డాయి. వర్షం కురిసినప్పుడు గుంతల్లో నీరు నిలిచి గుంతల ఏర్పడకపోవడంతో రాత్రి సయమంలో ప్రయాణించే వాహనదారులు ప్రమాదలుకు గురవుతున్నారు. అలాగే తాడిచర్ల ఆర్ అండ్ ఆర్ కాలనీ, ఎర్రగుంట చెరువు సమీపంలోని రోడ్డుపై వెడల్పుగా గుంత ఏర్పడింది. దీంతో వాహనదారులు ప్రమాదాలకు గురికావండతోపాటు వాహనాలు సైతం మరమ్మతులకు గురవుతున్నాయని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా రాత్రి సమయంలో ఇబ్బందిగా ఉంటుందని వాపోతున్నారు. అధికారులు స్పందించి గుంతలను పూడ్చాలని, శాశ్వత పరిష్కారం చూపాలని వాహనదారులు కోరుతున్నారు

తగ్గుముఖం పట్టిన ప్రాణహిత

కాళేశ్వరం: మహారాష్ట్రలో వర్షాలు తగ్గటంతో పట్టడంతో కాళేశ్వరంలో ప్రాణహిత నది ప్రవాహం తగ్గుముఖం పట్టింది. గురువారం కాళేశ్వరం వద్ద 7 మీటర్లకు చేరింది. దీంతో దిగువన మేడిగడ్డ(లక్ష్మీ)బరాజ్ వద్ద 3,62,685లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో తరలి వస్తుంది. 85గేట్లు ఎత్తి నీటిని దిగువకు తరలిస్తున్నారు. కాగా, అన్నారం బరాజ్ వద్ద 5,800వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుంది. దీంతో దిగువకు 66గేట్లు ఎత్తి నీటిని కాళేశ్వరం వైపునకు తరలిస్తున్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటాలి



చిట్యాల: సమావేశంలో మాట్లాడుతున్న చందుపట్ల కీర్తిరెడ్డి

టేకుమట్ల: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తాచాటాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ చందుపట్ల కీర్తిరెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో బీజేపీ జిల్లా, మండల అధ్యక్షులు ఏడునూతుల నిశీధర్‌రెడ్డి, దేశెట్టి గోపాల్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రంలో త్వరలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వార్డు సభ్యుల నుంచి జెడ్పీటీసీ వరకు బీజేపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పని చేయాలన్నారు. అనంతరం ఇటీవల మృతి చెందిన బీజేపీ నాయకుల కుటుంబ సభ్యులను పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో లింగంపెల్లి ప్రసాద్‌రావు, గుర్రపు నాగరాజు, బండారు సమ్మయ్య, శ్రీపతి రవి, కూర సురేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చిట్యాల: రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో బీజేపీ అభ్యర్థులు గెలిచి సత్తా చాటాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ చందుపట్ల కీర్తిరెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో మండల అధ్యక్షుడు బుర్ర వెంకటేష్‌గౌడ్ ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కీర్తిరెడ్డి హాజరై మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోదీ చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రతి ఇంటింటికీ వివరించాలని అన్నారు. అనంతరం మండల కేంద్రానికి చెందిన చింతల సాంబయ్య తల్లి చింతల కనకలక్ష్మి ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగపూరి రాజమౌళి, లింగంపల్లి ప్రసాద్‌రావు, చెక్క నర్సయ్య, జగ్గయ్య, అనిల్, కుమారస్వామి, మైదం శ్రీకాంత్, చింతల రాజేందర్, సుందర్, అజయ్, అశోక్‌చారి, సారంగాపాణి, ప్రభాకర్ పాల్గొన్నారు.

వైభవంగా బోనాల జాతర



బోనాలతో వెళ్తున్న మహిళలు

కాటారం: మండలంలోని గంగారంలో శ్రీ మహంకాళి అమ్మవారి బోనాల జాతర వైభవంగా నిర్వహించారు. మహిళలు బోనం ఎత్తగా శివసత్తులు పూనకాలతో నాట్యమాడారు. గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో కుటుంబ సమేతంగా అమ్మవారికి మొక్కులు సమర్పించారు. కోళ్లు, మేకలు బలిచ్చి నైవేద్యం పెట్టారు. పంటలు సమృద్ధిగా పండి కుటుంబ సభ్యులు సంతోషంగా ఉండాలని వేడుకున్నారు.

తపాలా సేవలను వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న రామకృష్ణ

భూపాలపల్లి రూరల్: తపాలా శాఖ ద్వారా అందజేస్తున్న సేవలను ప్రజలందరూ వినియోగించుకుని లబ్ధి పొందాలని భూపాలపల్లి సబ్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ అఫ్ పోస్ట్ రామకృష్ణ సూచించారు. భూపాలపల్లి మండలంలోని పంబాపూర్ పోస్ట్ ఆఫీస్‌లో తపాలా శాఖ పథకాలపై గురువారం గ్రామస్తులకు అవగాహన కల్పించారు. అధిక వడ్డీ పొదుపు పథకాలు, సుకన్య, ఫిక్సిడ్ డిపాజిట్లు, ఇన్సూరెన్స్ తదితర పాలసీల ప్రయోజనాలు వివరించారు. పేద, మధ్య తరగతి ప్రజలకు పొదుపు మేలు చేస్తుందన్నారు. ఈ అవగాహన సదస్సులో ఏంఓ నరేష్ చారి, ఎగ్జిక్యూటివ్ శ్రీకాంత్, బీపీఎంలు వెంకటేశ్, లక్ష్మీనారాయణ, రాజేశ్, యుగేందర్, శివరాం, ప్రశాంత్, వినయ్ శ్రీ రామ్, కో ఆపరేటివ్ సొసైటీ డైరెక్టర్ ఇట్టమల్ల ఎసుమణి గ్రామస్తులు పాల్గొన్నారు.

బొగ్గుల వాగు ప్రాజెక్టు నీరు విడుదల



నీటిని విడుదుల చేస్తున్న మల్హల్‌రావు, అధికారులు

మల్హర్: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మల్హర్ మండలం ఎడ్లపల్లిలోని భారీ మధ్య తరహా బొగ్గులవాగు ప్రాజెక్టు నీటిని మాజీ ఎంపీపీ మల్హల్‌రావు, ఇరిగేషన్ అధికారులు గురువారం విడుదల చేశారు. ఈ ప్రాజెక్టు ద్వారా ఎడ్లపల్లి, రుద్రారం, కొయ్యూరు, వల్లెకుంట కాటారం మండలంలోని విలాసాగర్, రేగులగూడెం, దామెరకుంట, దేవరాంపల్లి, గంగారం గ్రామాలకు చెందిన 5150 ఎకరాలకు సాగు నీరు అందుతుందని ఇరిగేషన్ అధికారులు తెలుపుతున్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈఈ రాజేష్, బడితెల రాజయ్య, రైతులు పాల్గొన్నారు.

వేతనాల పెంపుపై హర్షం



సీఎం, మంత్రుల చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కళాకారులు

కాటారం: తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులకు 30 శాతం పీఆర్సీ అమలు చేయడంతోపాటు వేతనాలు పెంచడంపై హర్షం వ్యక్తం చేస్తూ కాటారం మండల కేంద్రంలో గురువారం కళాకారులు సంబరాలు జరుపుకున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితోపాటు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు జూపల్లి కృష్ణారావు, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈసందర్భంగా పలువురు కళాకారులు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం తమ సేవలను గుర్తించడం సంతోషకరమన్నారు. వేతనాలు పెంచిన రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు. కళాకారులు ఒనపాకల కుమార్, ప్రవీణ్‌కుమార్, మహేందర్, శంకర్, సురేందర్, శిరీష, సుమలత, మధుబాబు, రాధిక, నాగమణి, స్వాతి పాల్గొన్నారు.

దుస్తుల పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు

మహాముత్తారం: మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన దుస్తులను గురువారం పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ మాచర్ల శైలజ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ప్రభాకర్, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

ఎమ్మార్పీఎస్ నాయకుల సంబురాలు



టేకుమట్ల: సంబురాలు చేసుకుంటున్న నాయకులు

కాళేశ్వరం: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు అనుకూలంగా తీర్పు ఇచ్చిన నేపథ్యంలో ఎమ్మార్పీఎస్ నాయకులు మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో బస్టాండ్ వద్ద గురువారం బాణాసంచా కాల్చి సంబురాలు నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు గణపతి, రాజయ్య, ప్రవీణ్, రాజబాపుతో పాటు పలువురు తీర్పుపై హర్షం వ్యక్తం చేశారు.

టేకుమట్ల: ఎస్సీ వర్గీకరణకు సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును హర్షిస్తూ గురువారం మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జ్ రేనుకుంట్ల సంపత్ ఆధ్వర్యంలో ప్రధాని మోదీ, మంద కృష్ణ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి స్వీట్లు పంచి టపాసులు పేల్చి సంబురాలు చేసుకున్నారు. రాంరాంచందర్, శంకర్, రాజయ్య, భద్రయ్య, సారయ్య, బోయిని తిరుపతి, మచ్చ సారయ్య, సరోత్తం, మారెపెల్లి మల్లేష్, శంకర్ పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు తీర్పు అమలు చేయాలి



చిట్యాల: అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

చిట్యాల: సుప్రీంకోర్టు ఇచ్చిన ఎస్సీ వర్గీకరణ తీర్పును గౌరవించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయాలని అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి పుల్ల మల్లయ్య, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ఓదేలు కోరారు. గురువారం సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణపై ఇచ్చిన తీర్పు సందర్భంగా మండల కేంద్రంలో అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి బాణా సంచాకాల్చి సంబురాలు చేసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ తీర్పు ఎంతో హర్షనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో అంబేడ్కర్, ఎమ్మార్పీఎస్ నాయకులు జన్నె యుగేందర్, సురేష్, బోడ్డు ప్రభాకర్, దొడ్డి కిష్టయ్య, ఆరెపల్లి నర్సింహరాములు, కట్కూరి రాజేందర్, మాసు రమేష్, నేరెళ్ళ సమ్మయ్య, పాముకుంట్ల చందర్, కనకం తిరుపతి, బోట్ల ఆనందం, సృజన్ , సమ్మయ్య పాల్గొన్నారు.

మావోయిస్టులకు సహకరించొద్దు



బస్సును తనిఖీ చేస్తున్న పోలీసులు

టేకుమట్ల: మావోయిస్టులకు సహకరించొద్దని ఎస్సై గోగికారి ప్రసాద్ అన్నారు. గురువారం మండలంలోని గర్మిళ్లపల్లిలో మావోయిస్టు వారోత్సవాల సందర్భంగా వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ప్రధాన రోడ్డులో ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, అనుమానితుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కూడలీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో అసాంఘిక వ్యక్తులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏఎస్సై అమరేందర్‌రెడ్డి, కానిస్టేబుల్ మహేందర్, నాగరాజు ఉన్నారు.

తహసీల్దార్‌ను కలిసిన బీజేపీ నాయకులు



తహసీల్దార్‌తో బీజేపీ నాయకులు

రేగొండ: ఇటీవల నూతనంగా బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్ శ్వేతను బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఏడునూతుల నిషిధర్‌రెడ్డి, పార్టీ నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మండలాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు ఏడునూతుల విజేందర్‌రెడ్డి, లింగంపల్లి ప్రసాదరావు, నాయకులు గన్‌రెడ్డి లింగారెడ్డి, మెతుకుపల్లి బుచ్చిరెడ్డి, పెండ్యాల రాజు, నేరెళ్ల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని వ్యక్తిపై మానవతాదృక్పథం



మతిస్థిమితం లేని వ్యక్తిని శుభ్రపర్చిన అనంతరం అతడితో సంస్థ సభ్యులు

కాటారం: ఓ మతిస్థిమితం లేని వ్యక్తిపై మానవతా దృక్పథం చాటుకున్నారు మండలానికి చెందిన స్వయం కృషి స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు. వివరాల్లోకి వెళితే.. కాటారం మండలంలోని అంకుషాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని దస్తగిరిపల్లిలో ఓ వ్యక్తి మతిస్థిమితం లేకుండా తిరుగుతున్నాడు. స్థానికుల సమాచారంతో సేవా సంస్థ ఫౌండర్ కొట్టె సతీశ్, సభ్యులు గురువారం గ్రామానికి చేరుకున్నారు. నాయీబ్రాహ్మణ సంఘం సభ్యులు రాజు, శ్రీకాంత్ సహకారంతో మతిస్థిమితం లేని వ్యక్తికి సేవా సంస్థ సభ్యులు దగ్గరుండి కటింగ్ చేయించి బట్టలు, భోజనం అందించారు. సదరు వ్యక్తి భూపాలపల్లి మండలం నాగారం గ్రామానికి చెందిన వ్యక్తి అని వివరాలు తెలుసుకొని గ్రామానికి పంపించారు. ఈ కార్యక్రమంలో సేవా సంస్థ సభ్యులు సీఆర్పీఎఫ్ జవాను మనోహర్, కడారి విక్రమ్, ఆదిత్య, రాజే, శ్రీకాంత్, హైమద్, రవి, సుమన్, పహీం, ఇంతాయాజ్, ఫయాజ్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో దుక్కిటెద్దు మృతి



భూపాలపల్లి రూరల్: విద్యుదాఘాతంలో దుక్కిటెద్దు మృతి చెందిన ఘటన భూపాలపల్లి మండలంలోని శ్యాంనగర్ గ్రామంలో గురువారం చోటు చేసుకొంది. గ్రామస్తుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన సుధాటి తిరుపతిరావు దుక్కిటెద్దు మేతకు వెళ్లింది. ఈ క్రమంలో గ్రామ శివారులోని పొలంలో తెగిపడిన విద్యుత్ వైర్‌కు తగిలి షాక్ గురై అక్కడిక్కడే మృతి చెందింది. ఎద్దు విలువ సుమారు రూ.60 వేలు ఉంటుందని ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.